కథ

# 'అమ్మా! నన్ను చంపద్దమ్మా!

ఒడియా మూలం: **శ్రీకాంత పరిజ**

తెలుగు అనువాదం: **మరాశాస్త్రి**

ఓ రోజు ఒక నర్సింగ్ హోమ్ చెత్తకుండీ మీద నా కన్నుపడింది. సాధారణంగా డస్ట్‌బిన్ కంటబడగానే మొహం తిప్పుకుని పోతారు. కానీ చెత్తకుండీలోని దృశ్యం చూసేక, నేను మెడ తిప్పలేకపోయేను. ఓ కుక్క నవజాత శిశు కళేబరాన్ని మహదానందంగా తింటూంది. శిశువు చెయ్యి ఒకటి చెత్తకుండీ నుంచి క్రిందకు వ్రేలాడుతూంది.

జంతుమాంసం తినే మనుషులు మేకను కోసే చోటుకి వెడతారు. ఒకరినొకరు తోసుకుంటూ ఎదరకు సాగి, అక్కడ కట్టివున్న మేక పొట్టనీ ఇతరత్రా భాగాలనూ తడిమి చూసేక, కసాయితో అంటారు– 'దీన్ని కొయ్యి, క్రొవ్వుబాగా పట్టిఉంది. మేం అయిదుగురం; ఎనిమిది కిలోలు తీసుకుంటాం. కసాయి వాడు మేక రెండు కాళ్లనూ తొక్కి పట్టుకుని మేక మెడను పైకెత్తి లాగిపట్టుకుని దాని పీకకోస్తాడు. మేక మేఁ మేఁ అంటూ అరుస్తుంది, కాస్సేపు తన్నుకుంటుంది; చిక్కని ఎర్రని రక్తం స్రవిస్తుంది. సరిగా అప్పుడు మాంసం కొనుగోలుదారులు సంతోషంగా ఎగబడతారు. గిలగిలా తన్నుకుంటున్న మేక వెనుక కాళ్ళ దగ్గర క్రింది భాగాన తొక్కిపట్టి ఉండగా యిద్దరుముగ్గురు హెచ్చరిస్తూంటారు – 'బాగానే ఉంది కానీ నీళ్ళు అసలు పొయ్యకు!'

మేక ప్రసక్తి ఎందుకంటే,

రక్తం రంగు ఒక్కటే కానీ మనం చూడడంలో ఉంది తేడా! తినే ముందు పశువు రక్తం చూడ్డానికి చాలా యిష్టపడతాం, కానీ మనిషి రక్తం చూసి తట్టుకోలేము. కానీ అదే మనుషులం మనిషి రక్తంతో హోళీ ఆడుకుంటాము. అదే మనుషులం. ఈ సమాజాన్ని ముందుకు నడిపేవారిని దేవతలుగా సమ్మానిస్తాం. విద్యావేత్తలు సేవామూర్తులు అయివుండీ కూడాను, డబ్బుకోసం అన్నెంపున్నెం ఎరుగని గర్భస్థ శిశువులను ముక్కలు ముక్కలుగా తరిగి పారేసి, సమాజంలో పెద్దమనుషులుగా చెలామణి అవుతూ వుంటారు.

ఆ రోజున శిశుకళేబరాన్ని మేక పీక్కుతినడం చూసేక నేనింక ముందుకు సాగలేకపోయాను, చెత్తకుండీలో నుంచి ఎవరో నన్ను పిలుస్తున్నట్టు అనిపించింది.

దగ్గరగా వెళ్ళి వంగి చెత్తకుండీలోకి చూసేను. ఏవిటిది, కొందరు మనుషులు యింతటి భీభత్సాన్ని సృష్టించగలరా? ఆడశిశువు పూర్ణాంగ మృత కళేబరం! ముక్కచెక్కలయి పడివుంది! ఎడమ కన్ను భాగాన్ని చీమలు పురుగులు పట్టి తింటున్నాయి. చనిపోయీ, ఆమె ఏదో చెప్పాలనుకుంటూన్నది! ఎన్నెన్నో మాటల మూటల్ని విప్పాలనుకుంటున్నది! రక్తశిక్త బుల్లిబుల్లి పెదాలనుంచి ఎన్నో ప్రశ్నలు అడగాలను కుంటూంది. కాలికి చిన్నముల్లు గుచ్చుకుంటే ఎంత బాధపడతాం? ఈ శిశువుని నిర్దాక్షిణ్యంగా తరిగి పారేసినప్పుడు, లేదా మందులిచ్చి చంపేసినప్పుడు ఆ ప్రాణి ఎంత బాధపడి ఉంటుంది. మీరే చెప్పండి. కసాయివాడు మేకను పీకకోసి ఒక్కసారి చంపేస్తాడు. కానీ కడుపులో ఉన్న ఈ ఆడ శిశువును చంపిన వాడికి పూర్తిగా కంటపడదు. గ్లౌజు తొడిగిన చేత్తో అందినంత మట్టుకు నరుక్కుంటూ పోయి ఉంటాడు. ఆ శిశువు ఎంత గిలగిల్లాడి ఉంటుందో కదా!

అక్కడలాగే నిలబడిపోయేను. తమ కామతృప్తిలో చరితార్థులై కేవలం మగ శిశువుపట్ల వున్న స్వార్థంతో ఈ ఆడశిశువును ఛిద్రం చేయించగలిగిన 'తల్లిదండ్రుల మీద విపరీతమైన కోపం వచ్చింది. చివరికి ప్రాణదాతలుగా పిలువబడే డాక్టర్లు యిలా భ్రూణహత్యలు చేస్తూ శిశు హంతకులుగా మారిపోతున్న వారి పట్ల నా మనసులో ఆందోళన బయలుదేరింది.

రాత్రిళ్ళు నిద్రపట్టదు, పగలు ఆఫీసు పనిలో మనసు నిలవదు. ఆ శిశుప్రాణి నాచెవుల దగ్గరకొచ్చి తన వేదనను చెప్పుకుంటున్న అనుభూతి– 'అంకుల్, వాళ్ళు నన్ను చిత్రహింసకు గురిచేసి చంపేశారు. నేను పసిదాన్ని కదా, ఏడవడం తప్ప ఎదుర్కోలేకపోయేను!'

ఒకరోజున ఉన్నట్టుండి నాకొక ఆలోచన వచ్చింది– పాప, పాపం, పసికందు కాబట్టి ఎదుర్కోలేకపోయింది. నేనే ఎదుర్కోగలను కదా? సభ్యసమాజం చేసే అకృత్య అమానుషాలను ఎండ గట్ట గలనుకదా? అనిపించింది.

:... తియ్యి, నీ కలంతో పొడిచి ఆడశిశువు హంతకులను అంతమొందించు. నీ కలంలోని నల్లని సిరాతో హంతకుల ముఖాలను మలిన పరచు! ఆ తల్లులకు ఆ పిల్ల మాటలను వినిపించు! డబ్బుకి ఆశపడి భ్రూణహత్యలు చేస్తూన్న, పెద్దమనుషుల్ని సమాజం ముందు దోషులుగా నిలబెట్టు! అని అంత రాత్మ ప్రబోధించింది.

× × ×

అమ్మా! నేనే నీకు బొత్తిగా గుర్తుకు రావడంలేదా? ఇలా ఎందుకు చేసావమ్మా? పసిదాన్ని కదా, నీముఖం చూడాలనిఎంతో ఆశతో చూస్తూన్న నన్ను ఎందుకు చంపేశావమ్మ ? నిన్ను తప్పమరెవరినీ ఎరగను. నీకోసం కదమ్మా నాలుగోమాసం వరకూ యిన్ని అనుభవించాను. నాకింకా గుర్తుంది. నా రాజా అన్నయ్య

ఏడుస్తూంటే, వాడిని ఊరడిస్తూ నువ్వున్నావు. ఏడువకు నాన్నా! నీతో ఆడుకుందుకు ఓ బుల్లి తమ్ముడొస్తున్నాడు. నేను నవ్వుకున్నాను– అమ్మా! నేను బాబును కాదమ్మా! రాజా అన్నయ్యకోసం బుల్లి చెల్లి వస్తూందమ్మా!' అని చెప్పాలనుకున్నాను.

నువ్వు రాజా అన్నయ్యను పక్కలో పడుకోబెట్టుకుని పడుకుంటావు, కానీ నేను రాత్రిళ్ళు పడుకుని నిద్రపోలేను. రాజన్నయ్యతో కలిసి అల్లరి చేస్తూ ఆడుకోవాలని నాకెంతో కోరిక! అందుకని మధ్యమధ్య పొట్టలోంచే రాజన్నయ్యను నా కాళ్లతో నెమ్మదిగా గెంటుతూంటాను. తను కూడా నిద్దట్లోంచి లేచి నీ కడుపునుచేత్తో నెట్టుతూంటాడు. నాకు ఎంతో నొప్పిపెడుతుంది కానీచాలా సంతోషంగానూ ఉంటుంది. ఎందుకంటే అన్నా చెల్లెళ్ళ ఆటలో వున్న మజాయే వేరు!

ఆc, రాజన్నయ్యకు పాలుతాగిస్తూ నువ్వంటుంటావు 'నా బంగారుకొండ! బాగా చదువుకుని పెద్దడాక్టరు కావాలి' నేను నీ పొట్టలో వుండే నవ్వుకుంటూ అనుకుంటాను' రాజన్నయ్య అల్లరివాడవుతున్నాడు. నేను తప్పక చదువుకుని డాక్టరుని అవుతానమ్మా.

ఆరోజు రాజన్నయ్య పుట్టినరోజు. నాకు చిన్న పిల్లల నవ్వులు కేరింతలు వినబడుతున్నాయి. నాకూ వెంటనే మీ మధ్యకు వచ్చి నవ్వుతూ గెంతుతూ గడపాలని ఎంతకోరికో.

'కేక్ కట్ చేస్తారు రండి పిల్లలూ ' అంటూ పదే పదే పిల్లల్ని పిలుస్తూంటావు. పిల్లలందరూ వచ్చి 'హేపీ బర్త్‌డే' చెప్పారు. రాజన్నయ్యని కేకుని అందరకూ పంచమంటావు.

ఆ కేక్ఎలాఉంటుందో తెలుసుకోవాలను కుంటాను నేను. రాజన్నయ్య అమ్మా! నోరు తెరు నీకు కేకు పెడతాను!' అన్నాడు. నీకడుపులో వున్ననేను 'ఆ' అంటూ నోరు తెరిచాను. కొంత సేపటికి కేకు నేనూ తిన్నాను. రాజన్నయ్యకు హేపీ బర్త్‌డే ! చెప్పాను.

రాజన్నయ్యకు ఒంట్లో బాగుండకపోతే నువ్వు అంటావు. – 'సారళా మా! నా కొడుకును కాపాడు తల్లి!నా కళ్ళు అప్పుడు చెమరుస్తాయి. మా అమ్మ ఎంతమంచిదో, తన పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తుంది.

నీ గురించిన ఆలోచనలతోనే ఈ నాలుగు మాసాలు గడిపేశాను. నీముఖం ఎప్పుడు చూస్తానా అనేదే నా చింత. రాజన్నతో నువ్వంటూ ఉంటావు– పదిమాసాలు మోసి నిన్ను కన్నానురా కన్నా! నువ్వు పెద్దయ్యేక నా పేరు నిలబెట్టాలి. అని

"ఆ రోజు నేనెంత ఏడ్చానో! రాజన్నయ్యను ముద్దాడినందుకు కాదు, నా తల్లి ముఖాన్ని చూడడానికి యింకా ఎంత కాలం వేచి చూడాలో కదా" అని.

నాకో నాన్నగారున్నారు. రాజన్నయ్య నాన్నగారూ! నాన్నగారు! అంటూ పిలవడం నే విన్నాను.

ఓ రోజు నువ్వూ నాన్నగారూకలసి డాక్టరు దగ్గరకు వెడుతూంటే, త్రోవలో నేను బాగా కదిలిపోయి, బాధపడ్డాను. అప్పుడు నాన్న గారితో నువ్వన్నావు 'బండిని మెల్లగాపోనీండి!' అని.

వెంటనే నేనా కష్టాన్ని మరిచిపోయేను. మా అమ్మ నన్నెంత ప్రేమిస్తోందో కదా అని సంతోషించాను, నా బాధను తను అర్థం చేసుకుందని.

ఆసుపత్రి బెడ్డుమీద పడుకున్నావు, నేను నీ కడుపులో ఆడుకుంటున్నాను. డాక్టరునీ కడుపులోకి ఏదో పంపించి నా శరీరాన్ని తాకే ప్రయత్నం చెయ్యగానే డాక్టర్ని అల్లరి పెడదామన్నంత కోరిక కలిగింది. నేను కడుపులో అటుతిరిగి యిటు తిరిగి ఆడుకుంటున్నాను. అప్పుడు డాక్టరు అన్నారు. 'కడుపులో పిల్ల తిరుగుతూంది; వెంటనే తెలియడంలేదు.' అని

కొంత సేపటికి అన్నారాయన 'గర్ల్ చైల్డ్' ఆ తర్వాత అంతా నిశ్శబ్దం. నా తండ్రి అని పిలవబడే మనిషి డాక్టరు గారికి చెప్పాడు– 'సార్! ఎబార్షను చేసెయ్యండి'

'రేపు ఉదయం రాండి' అన్నారు డాక్టరుగారు.

నేను లోపలుండి నవ్వుకున్నాను, నా ఆటలోనేను మునిగిపోయేను.

మర్నాడు ఉదయం పూజా సమయంలో నువ్వు వేడుకున్నావు.– 'అమ్మా! సారళా మాతా! నేనుక్షేమంగా వెళ్ళి తిరిగి క్షేమంగా యింటికొచ్చేలాగా చూడు తల్లీ! అని నీకు ఒంట్లో బాగుండలేదని అర్థం చేసుకుని నేను కూడా కంట తడి పెట్టుకుని, కనబడని ఆ తల్లిని అడిగాను 'మా అమ్మను బాగా చూడు తల్లి ' అని.

ఆసుపత్రిలో మంచం మీద నువ్వు పడుకున్నావు. ఎందుకనో నాకూ నిద్రముంచుకొచ్చింది. నాకళ్ళు మూసుకోసాగాయి. సరిగా అప్పుడే డాక్టరు గారు లోపలికి వచ్చి అడిగారు.

'నర్స్! ఇంజక్షను యిచ్చారా?'

నర్స్ 'హాc ! సార్!' అంది.

'అమ్మా ఆ తర్వాత హఠాత్తుగా నా కోమలమయిన పాదాలకు ఎవరిదో చెయ్యి తగిలింది.

అమ్మా అమ్మా లే అమ్మా.. నా పాదాల నెవరో కోసేస్తున్నారమ్మా. నేను చచ్చిపోతున్నానమ్మా. చూడమ్మా నా శరీరాన్ని ఆ రాక్షసుడు ఎలా కోసేస్తున్నాడో చూడమ్మా. అని అలా నేను చాలా అరిచి గోలపెట్టాను, కానీ నువ్వు వినిపించుకోలేదమ్మా.

నేను బతకనమ్మా. చూడమ్మా.. డాక్టరు నా కళ్ళను పొడిచెయ్యగానే, నేను గిలగిలా తన్నుకున్నాను. 'సారళామా!' నా గోల ఎవరూ వినిపించుకోలేదు.

డాక్టరు నన్ను ముక్కముక్కలు చేసేసాడు. అమ్మా అమ్మా అంటూనే ప్రాణాలు వదిలేశాను.

నన్నెందుకు చంపావు చెప్పు. నేను చెడ్డదాన్ని కాదమ్మా. అన్నంపెట్టకపోయినా అడిగేదానిని కాదు. రాజన్నయ్య వదిలేసిన మెతుకులు తిని బతికేదానిని. నీ కొంగు పట్టి లాగి నిన్ను అల్లరి పెట్టి ఉండే దానిని కాను. ఒక్కసారి నీ ముఖాన్ని చూడనిచ్చాక నన్ను చంపి ఉండాల్సింది. చనిపోయి కూడా నీ గర్భంలోనే ఉన్నాను. నా ఆత్మ నీలో ఉండి నీ స్పర్శానుభూతిని పొందుతూ ఉంది. నా ఆత్మ అనుక్షణం రోదిస్తూనే ఉంది. నామాట నా కోరిక మన్నించలేవా! నేను చిన్నారి పాపను కదా!

రాజన్నయ్య డాక్టరు కావాలని కోరుకుంటావు. ఇవాళ నామీద ఒట్టేసి చెప్పమ్మా వాడిని ఎంత మాత్రం డాక్టరు చెయ్యనని. వాడు ఒకవేళ డాక్టరే అయితే వాడుకూడా నాలాంటి గర్భస్థ శిశువుల్ని చంపి పారేస్తాడు.

నన్ను మరోమారు నీ గర్భంలో ధరించు, నాకు ఈ ప్రపంచాన్ని చూడాలని ఉంది. నాకు స్కూలుకి వెళ్ళి చదువుకోవాలనుంది. గలగలా నవ్వుతూ నీ వెనకాల తిరగాలనుంది. నీకు అనారోగ్యంలో సేవ చేయాలని ఉంది. నీ పని పాటల్లో నీకు చేదోడువాదోడుగా నిలవాలనుంది.

అమ్మా! నేను నీ చంటి పిల్లనమ్మా... నన్ను నీ ఒడిలోకి తీసుకో ... నన్నొక్కసారి ముద్దు చెయ్యమ్మా... నీ గుండెలకు అదుముకో. నీ కొంగులో నన్ను దాచి నా చెవిలో – 'నా బంగారు తల్లివి, పడుకో అమ్మా... ఎందుకు భయం! నేనున్నా నీ దగ్గర ' అని చెప్పమ్మా.

అమ్మా నన్ను చంపద్దమ్మా!!